# ఆలస్యం

"ఒక్కసారి రామానుజాన్ని పలకరించి రారా" అంది అమ్మ.

"అలాగేనమ్మా, వీలు కుదరాలి కదా!" అన్నాను.

"వీలు వీలంటూ ఎన్నాళ్ళు చేస్తావు? ఇలాంటి విషయాల్లో ఆలస్యం పనికి రాదు" అంది అమ్మ.

అమ్మ బాధ నాకు తెలుసు.

అన్నింట్లోనూ నేను కాస్త ఆలస్యం. ఒకసారి రామానుజం మా వూరు వస్తున్నట్లుత్తరం రాశాడు. మా యింటికి వచ్చిఉండమని ఉత్తరం రాద్దామనుకుని బద్ధకించేశాను. ఈ లోగా రామానుజం మా ఊరు వచ్చి మా యింటికి రాకుండానే వెళ్ళిపోయాడు. అతడికి నామీద కోపం వచ్చినట్లు ఆ నోటా ఆ నోటా అమ్మకు తెలిసింది.

రామానుజం తండ్రీ మా నాన్నగారూ పెదతండ్రి, పినతండ్రులబిడ్డలు. అయితే రామానుజానికి మాయింట్లో ప్రత్యేకమైన స్థానం ఉంది. అతడు మాకు ఎన్నో వ్యవహారాల్లో సాయపడ్డాడు, అతడి సలహా సంప్రదింపులు లేనిదే మా యింట్లో ఏపనీ చేయరు. అతడు నా కంటే రెండేళ్ళు చిన్న అయినా నేను కూడాఅతడిని పెద్దవాళ్ళకులాగౌరవిస్తాను.

రామానుజం ప్రతిపనీ ఒక పద్ధతి ప్రకారం చేస్తాడు. దేనికైనా ఒకరు అతడి మీద ఆధారపడాలి తప్ప దేనికీ ఎవరిపైనా ఆధారపడని సమర్థుడతడు. ఏ ఊరైనా వెళ్ళేముందు తనకు ముఖ్యులైన వారను కున్న వారికి ముందుగా ఉత్తరం రాస్తాడు. వారికి బదులివ్వడానికి తగినంత సమయమిస్తాడు. ఆ సమయం ఉపయోగించుకోని వారిముఖం చూడడు.

ఎవరింట్లో శుభకార్యం జరిగినా తను విధిగా హాజరవుతాడు. ఎవరికే కష్టం వచ్చినా స్వయంగా వెళ్ళిపరిస్థితి విచారించి నాలుగు ఓదార్పు మాటలు చెప్పి తనకు చేతనైన సాయం చేస్తాడు. నలుగురూ తన విషయంలోనూ అలాగే ప్రవర్తించాలని కోరుకుంటాడు.

రామానుజం విషయంలో నేను తప్పు చేశాను. ఇప్పుడా తప్పు సవరించుకునే అవకాశం వచ్చింది.

ముప్పై అయిదేళ్ళ వయసులో అతడి భార్య పోయింది.

అంత దుఃఖంలోనూ అతడు నా మీద కోపాన్ని చంపుకుని ఆ వార్తను ఒక కార్డు ద్వారా నాకు తెలియబర్చాడు.

"రామానుజం మనకు బాగాకావలసిన వాడు. పెద్ద కర్మ రోజుకు వెళ్ళి ఓదార్చిరా పాత కోపాలుమరిచిపోతాడు." అంది అమ్మ.

రామానుజం భార్యపోయిన వార్తవిని నేను షాక్ తిన్నాను. ఆమె నాకు బాగా

వసుంధర



తెలుసు. ఇంటికిరాగానే ఎంతో ఆప్యాయంగా పలకరించి ఆదరించేది. మొదటి సారి చూసినప్పుడే ఆమె ఎన్నాళ్ళనుంచో తెలిసిన ఆత్మీయురాలనిపిస్తుంది.

అమ్మ ఎన్ని చెప్పినప్పటికీ పెద్ద కర్మరోజున ఆ యింటికి వెళ్లాలనుకోలేదు. ఆ వాతావరణంలో నేను క్షణంకూడా బ్రతకలేననిపించింది.

"ఇలాంటి విషయాల్లో ఆలస్యం బాగుండదురా- పెద్ద కర్మరోజున కాకపోయినా ఆ తర్వాత ఓ వారంరోజుల్లో వెళ్ళి ఓదార్చివస్తే బాగుంటుంది." అంది అమ్మ.

అమ్మ భయమేమిటో నాకు తెలుసు. నాకు బొత్తిగా నోట్లో నాలికలేదని ఆమె భయం. నాభార్యకూడా అలాంటిదేనని ఆమె నమ్మకం. మా యిద్దరికీ రామానుజం వంటివాడి అండ అవసరమని నా మేలుకోరి అమ్మ ఆ సలహానిస్తోంది. కానీ బద్ధకం నాసహజగుణం.

రోజూ ఏదో సమయంలో ఈ విషయమై అమ్మ నన్ను హెచ్చరిస్తున్నప్పటికీ, అలాగే రెండు నెలలు గడిచిపోయాయి.

ఇలా ఉండగా అనుకోకుండా ఆఫీసు

ఆలస్యం

పనిమీద నాకు రామానుజం ఊరు వెళ్ళే పని తగిలింది. అమ్మకు అసలువిషయం చెప్పకుండా రామానుజాన్ని ఓదార్చడానికే వెళుతున్నట్లు చెప్పాను. ఇన్నాళ్ళకైనా తనమాట వింటున్నందుకు అమ్మ ఎంతో సంతోషించింది.

"తనవద్దకు వద్దామని ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు అబద్ధం చెప్పు. ఏదో విధంగా క్షమార్పణ కూడా అడుగు" అంది అమ్మ.

సరేనని రామానుజం వూరు వెళ్ళాను.

అనుకోకుండా రామానుజం నాకు బజార్లోనే కనిపించాడు. అతడు నన్ను చూసికూడా చూడనట్లు నటించాడు. నేనే అతణ్ని పలకరించాను.

"ఎప్పుడొచ్చావ్?" అన్నాడు రామానుజం.

"ఇప్పుడే!"

"ఆఫీసు పనిమీదొచ్చావా?"

"ఎలా తెలుసు?"

"లేకపోతే నువ్వు మా వూరెందుకొస్తావు?" అన్నాడు రామానుజం.

నాలిక్కరుచుకున్నాను ఎంత పొరబాటై పోయింది? నేను రామానుజాన్ని చూడ్డం కోసమే ఆ వూరొచ్చానని చెప్పాల్సింది. ఇప్పుడేం చేయాలి?

రామానుజం వెళ్ళిపోయాడు. అతడితో ఇంకేం మాట్లాడాలో అతడినెలా ఆపి ఓదార్చాలో నాకు తెలియలేదు.

సాధారణంగా రామానుజం నన్నింటికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఈరోజలా జరగలేదంటే అతడికి నామీద చాలాకోపంగా ఉండి ఉంటుంది. సాయంత్రం దాకా ఆఫీసు పని చూసుకుని అప్పుడు రామానుజం ఇంటికి వెళ్ళి అతడి మనసుకు సంతోషం కలిగించాలని అనుకున్నాను.

నా ఆఫీసు పని త్వరగా పూర్తయింది. పిలవకపోయినా ఫరవాలేదనుకుని సాయంత్రం ఆరింటికి అతడింటికి వెళ్ళాను

ఇంట్లో రామానుజం పిల్లలు ముగ్గురూ ఉన్నారు. వాళ్ళు నాకు ఉత్సాహంగానూ, మామూలుగానూ కనిపించారు. పెద్ద వాళ్ళిద్దరూ ఆడపిల్లలు. ఆఖరివాడు మగపిల్లాడు. అన్ని పనులూ వాళ్ళే చేసుకుంటున్నారు.

రామానుజం ముభావంగా నన్ను ఆహ్వానించాడు. ఇద్దరం ఓ గదిలో చెరో కుర్చీలో కూర్చున్నాం.

"సీతమ్మ లేని ఈ ఇంట్లో అడుగు పెట్టలేక రాలేదు. ఈవేళ కూడా బాగుండదని వచ్చాను. కానీ తలుపు తియ్యగానే

చిరునవ్వుతో ఆహ్వానించే సీతమ్మ కన బడని ఈ ఇంటికెవ్వరు మాత్రం వస్తారు?" అన్నాను.

రామానుజం విషాదంగా నవ్వాడు. సీతమ్మ అతడి భార్య.

సీతమ్మ గురించి మాట్లాడుతూంటే నాకు నిజంగా దుఃఖం పొంగుకొస్తోంది. అందువల్ల మధ్యలో నాకు జేబురుమాలు కూడా అవసర పడింది.

నేనలా ఏకధాటిన ఓదార్పు కార్యక్రమంలో ఉన్న సమయంలో ఆ గది గుమ్మం వద్ద ఓ నడివయస్కుడు ప్రత్యక్షమయ్యాడు.

"ఒక్కసారిలా వస్తారా?" అన్నాడాయన.

నేను రామానుజం వంక చూశాను. అతడు ఇంటి కప్పువైపు చూస్తున్నాడు

నేను గదిలోంచి బయటకు నడిచి ఆయన ననుసరించాను. నన్నాయన దొడ్లోకి తీసుకుని వెళ్లి అక్కడ ఆగాడు నేనూ ఆగాను.

"మీరెవరో నాకు తెలియదు కానీ బొత్తిగా సమయాసమయాలు తెలియని వారిలా ఉన్నారు. ఎప్పుడో రెండునెలల క్రితం చెప్పాల్సిన మాటలు ఇప్పుడు చెబుతున్నారు-" అన్నాడాయన.

"రెండు నెలల క్రితమే నేను రావా" ల్సిందండి. పనుల ఒత్తిడివల్ల కుదరలేదు అన్నాను.

"అయితే మాత్రం కథ మళ్ళీ మొదటికి తెస్తారా?" అన్నాడాయన.

నాకు అర్థం కాలేదు "కథ మొదలేమిటండీ?" అన్నాను.

"రామానుజానికి సీతమ్మంటే ఇష్టం సీతమ్మ చల్లని తల్లి. ఇవి తిరుగులేని నిజాలు. కానీ పోయినవాళ్ళతో మనమూ పోలేం గదా! రామానుజానికి మీరిప్పుడు సీతమ్మ గురించి గుర్తు చేయడం తగిన పన్నేనా?" అన్నాడాయన.

"మరేం చేయాలంటారు?" అన్నాను కాస్తచికాగ్గా.

"పోయిన వాళ్ళతో మనమూపోతామా నీకు మాత్రం ఇంకా వయసేం మించి పోయింది, ముందుముందు పిల్లలకు కథలూ, కార్యాలూ నడిపించాలి నువ్వు మళ్ళీ పెళ్ళిచేసుకో! నీ కోసం కాక పోయినా నీ పిల్లలకోసం నువ్వు చల్లగా ఉండాలని కోరుకునే మాలాంటి వాళ్ళ కోసం నువ్వు పెళ్ళి చేసుకునితీరాలి...." అని ఒక్క నిమిషంఆగి "ఇవీమీరతడికి చెప్పాల్సిన మాటలు...."అన్నాడాయన.

అసలీ విషయమే నాకు స్ఫురించలేదు నాకీ సలహా ఇచ్చిన పెద్దమనిషి వారం రోజులుగా ఆ ఇంట్లో ఈ పనిమీదే ఉంటున్నాడట. రామానుజం ఆయన్ని బాగా అదిరిస్తున్నాడుట.

నేను మళ్ళీ రామానుజం దగ్గరకు వెళ్ళాను. అతణ్ని పరీక్షించి చూశాను. ఆయన చెప్పిన మాటలే చెప్పాలను కున్నాను. కానీ అంత వెంటవెంటనే నాకా మాటలు వంటబట్టవు కదా!

ఇలాంటి విషయాల్లో ఆలస్యం ఎందుకు పనికిరాదో అర్థమైంది. అట్టే మాట్లాడకుండా రామానుజాన్ని వదిలి పెట్టాను.

ఆ తర్వాత రెండు మాసాలకే రామానుజం మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు.